# బిగించిన పిడికిలి

జె. సరోజా ఆనంద్

రాత్రి పది కావస్తుంది. భోజనం ముగించి లుంగీ మీదనే బుషర్టు వేసుకొని వీధి చివర్న ఉన్న కిళ్ళీ షాపుకి బయలుదేరాడు కృష్ణమూర్తి.

"తొందరగా వస్తారా?" భర్తను ప్రశ్నించింది జయ. "పది నిముషాలో వచ్చేస్తాను" చెప్పులు వేసుకుంటూ జవాబిచ్చాడు కృష్ణమూర్తి.

'ఆఁ ఇది రోజూ పాడే పాటే. మీరొచ్చే సరికి నేనొక నిద్ర తీయనూ' అనుకుంది జయ. ఆ మాటే పైకి అంటే అది గొడవ క్రింద దారితీస్తుందని ఆమెకు తెల్సు.

భర్త వెళ్ళగానే తలుపు గడియ వేసి వచ్చి పుస్తకం తీసుకుంది జయ.

* * *

కృష్ణమూర్తిని చూడగానే వళ్ళకిలించాడు కిళ్ళీ బడ్డీ భైరయ్య. ఇకిలించడూ మరి- నెలకు వంద రూపాయల ఆకులు మేకలా నమిలే కృష్ణమూర్తిని చూస్తే ఏ వ్యాపారస్తుడికి మాత్రం ఆనందంగా ఉండదు!?

భైరయ్య కటించిన కిళ్ళీ నోట్లో పెట్టాడు కృష్ణమూర్తి. అతనికి మొత్తం నాల్గు కిళ్ళీలు. రెండు పట్టీలు తీసుకునే అలవాటు. అవన్నీ నములుతూ డైయిలీ పేపులాటి భైరయ్య చెప్పే కబుర్లు వింటూ టైం కూడా మర్చిపోతాడా మహానుభావుడు.

"పండక్కి బట్టలు తీసుకున్నారా సార్?"

"లేదయ్యా! పిల్లలు రోజూ గోల చేస్తూనే వున్నారు. అయినా తీరికెక్కడిది! వెధవది ఈ సెంట్రల్ గవర్నమెంటు. అందులో పోస్టల్ వాళ్ళ బ్రతుకంటే ఇంతే! బల్లిలా కుర్చీకి అతుక్కుపోవాలి. సాయంత్రం ఇంటికి వచ్చేసరికి ఇల్లాలి సాధింపులు. పిల్లల ఏడ్పులతోపాటు ఒంట్లో రోగాలు కూడా చుట్టుముడుతాయి. ఏ డాక్టరికి చూపించినా రోగం లేదనడు. మందులు రాయడు. టానిక్, బి కాంప్లెక్సు క్యాప్సూల్సు. ఏమిటి సార్ అంటే బలహీనమోయ్ నెర్వస్ వీక్‌నెస్ అంటాడు. అన్నట్టూ.... మీ అన్నయ్య ఎవరో బట్టలషాప్‌లో గుమస్తా అని విన్నాను."

"అవును సార్."

"అక్కడ నుంచి బట్టలేమైనా ఉంటాయేమిటి?"

"అదుగో సార్ మాటల్లోనే మా అన్నయ్య కూడా వచ్చాడు."

"ఏమోయ్ చంద్రయ్యా మీ షాపులో మంచి క్వాలిటీ బట్టలు దొరుకుతాయా?"

"మా షాపని కాదు గాని సార్ మంచి బట్ట అంటే.... చాలా గ్యారంటీ సరుకు సార్".

"ధరలు ఎలా వేస్తాదేమిటి?"

"రీజనబుల్ ధరలు సార్. హోల్ కామారెడ్డి మొత్తంలో మా షాపులో ఉన్నంత చౌక మరెక్కడా ఉండదు."

"ఎందుకటా పాపం?"

"అదంతే సార్. మీటరుకి అయిదు రూపాయలొచ్చినా చాలు నెట్ అమ్మాలి. మళ్ళీ సరుకు తెప్పించాలి. ఇరవయిలో, ముప్పయిలో లాభాలొద్దు. అప్పులివ్వవద్దు. వాళ్ళ చుట్టూ తిరిగి విరోధం తెచ్చుకోవద్దు. ఎంత సేల్ అయితే అంతే అంటాడు మా సేట్. అతనిదొక రకమైన నేచర్."

"అలాగా. ఏమయ్యా కిళ్ళీలు కట్టడమయిందా?" అంటూ భైరయ్య యిచ్చిన కిళ్ళీలు తీసికొని ఇంటిత్రోవ పట్టాడు కృష్ణమూర్తి.

* * *

"పన్నెండుకు పావుగంట ముందే వచ్చారే" అంటూ తీసిన తలుపులు వేస్తూ అంది జయ.



"చాల్లే వోయ్ నీ వెక్కిరింపులు!" బుషర్టువిప్పి పక్కమీద వాలాడు కృష్ణమూర్తి.

"ఏవండీ!"

"ఊఁ"

"పండగ దగ్గరికి వస్తుందండీ...." నసిగింది జయ.


"పిల్లలకు బట్టలేనా తీసుకుందాం."

"తీసుకుందాం తీసుకుందాం అంటూనే ఇప్పుడు పది రోజులు గడిచాయి. తీరా పండగ దగ్గరికి వచ్చిన తర్వాత టైలర్స్ బట్టలు పట్టుకోరండీ."

"అలాగని ఎక్కడైనా దొంగతనం చెయ్యమంటావా?" దెబ్బకి అటు తిరిగి పడుకుంది జయ.

ఏమిటీ ఈయన తత్వం. ప్రొద్దున ఎనిమిదింటికి లేస్తే కాలకృత్యాలు తీర్చుకుని తొమ్మిదిన్నరవరకు ఆఫీసుకు రెడీ అవుతారు. గంటలో. అన్ని పనులు ముగించుకొనే హడావిడిలో వున్న భర్తతో ఏం మాట్లాడాలి ఏం చెప్పాలి! చెప్పినా అతను తనకి తెచ్చి ఇచ్చే సమయం ఏది? మధ్యాహ్నం రెండింటికి ఇల్లుచేరి భోజనం చేస్తూ న్యూస్ వినే మనిషితో ఎలా మాట్లాడటం. వార్తలు పూర్తికాకుండానే నిద్రలోకి జారిపోయి రెండున్నర, మూడు ప్రాంతాలలో ఉలిక్కిపడి లేచి అరే చాలా టైం అయిపోయిందే అంటూ క్రాపు కూడా దువ్వుకోకుండా పరుగులు తీసే వ్యక్తిని ఎలా ఆపటం? ఆ తర్వాత రాత్రి తొమ్మిది కాందే ఇల్లు జ్ఞాపకం రాదు. వచ్చినా మనిషి తిరిగి భోజనం, వార్తలు, కిళ్ళీ బడ్డీ ఇవన్నీ ముగిసేసరికి రాత్రి 11 గంటలు దాటుతుంది. ఇక అప్పుడు మాట్లాడడానికి తనకు ఓపిక వుండదు. ఓపిక వచ్చి వాదనలోకి దిగితే అర్ధరాత్రి ఇరుగు పొరుగు వింటారేమోనవే భయం. అందులో కృష్ణమూర్తి గొంతు కాస్త పెద్దది. అతనికి కోపం వచ్చినా, సంతోషం వచ్చినా వాల్యూం ఇంకా పెరుగుతుంది. ఇవన్నీ వినే అమ్మలక్కలు కృష్ణమూర్తి ఏ పార్టీకో అటెండయి వచ్చాడనో లేక పెళ్ళాం ఏం చేసిందో అరుస్తున్నాడని ఊహించుకుని మరునాడు ప్రొద్దున్నే వాకిలి ఊడ్చే తన ముఖంలోకి గుచ్చి గుచ్చి చూడటం అసలే తట్టుకోలేదు.

పై కారణాలన్నిటి మూలంగా జయ, కృష్ణమూర్తిల మధ్య సంసార విషయాలు మాట్లాడుకోవటానికి సమయమే దొరకటం లేదంటే అతిశయోక్తి కాదు. ఇద్దరి పొందికలో ఒక ప్లాన్‌తో నడవని సంసారంలోని ఒడిదుడుకులు ఆ యింటి ఇల్లాలికే తెలుసు.




ఆ ఇల్లాలిని సృష్టించిన ఆ భగవంతునికే తెలుసు.

* * *

"ఏమోయ్ చంద్రయ్యా షాపునుంచి వెళ్ళిపోతున్నావట నిజమేనా?" భైరయ్య ఇచ్చిన కిళ్ళీ నములుతూ అడిగాడు కృష్ణమూర్తి.

"అవున్ సార్ ఆం....కొడుకు, ఇన్నేళ్ళనుంచి నమ్మకంగా పని చేస్తున్నాను. ఒక్కొక్కసారి షాపు మొత్తం నా మీదే వదిలేస్తాడు సార్. 'చంద్రయ్యా! దుకాణం భారం నీది. తేల్చినా ముంచినా నువ్వే!' అన్నాడు తండ్రి. వ్యాపారంలో కిటుకులు ఏమీ తెలియని కొడుక్కి అన్నీ నేర్పాను సార్. వాడు సూదిలా వచ్చి దబ్బనంలా తయారయాడు సార్. గొర్రెకు బెత్తెడు తోక అన్నట్లు అన్ని ఏళ్ళనుంచి నా జీతం 300 రూపాయలే. ప్రొద్దున 8 గంటలకు వెళితే రాత్రి తొమ్మిది పదింటికి గాని విడువడు. బజార్లో ధరలు విపరీతంగా పెరిగిపోయాయి జీతం పెంచమంటే-గాడిద కొడుకు- 'నీ యిష్టం..! ఉంటే ఉండు లేకపోతేపో. జీతం మాత్రం అంతే.' అంటున్నాడు. ఏం సేటూ అంటే ఆ ముసలి నచ్చినోడు తండ్రి నోరు విప్పడు....లేదు సార్! దీనంతటికన్నా ఒక దుకాణం స్వంతంగా పెట్టుకోవాలని చూస్తున్నాను. డబ్బు కోసం చూస్తున్నా. సర్దుబాటైతే దుకాణం నుంచి వెళ్ళి వేరే బిజినెస్ చేయాలనుకుంటున్నా సార్. వేరే పెడ్తేనే గిట్టుబాటుంటుంది."

"ఎంతకు పెడతావేంటి."

"అదే ఆలోచిస్తున్నా సార్."

"ఒక ఇరవై వేలకు పెడతావా? పెడితే చెప్పు నేను కూడా పార్టనర్‌గా ఉంటాను."

"అంత పెట్టుబడి నేనెక్కడి నుంచి భరించగలను సార్."

"పోనీ పది వేలకు పెడతావా?"

"పది వేలలో ఏం సరుకు వస్తుంది సార్" తల గోక్కున్నాడు చంద్రయ్య.

"మరి?"

"అదే ఆలోచిస్తున్నా సార్. ఆరు మాసైనా మూడు ఆరైనా దీపావళికి దుకాణం పెట్టి తీరాలి సార్."

"సరే బాగా ఆలోచించి నాకు చెప్పు వస్తాను."

"మంచిది సార్. నమస్తే"

"సార్‌కేం తక్కువ మొన్న పలభై వేలకి ఫ్లాట్ మాట్లాడుతున్నారు" అన్నతో రహస్యంగా చెప్పాడు భైరయ్య.

* * *

"సార్ వున్నారామ్మా?"

"ఎవరూ నువ్వా చంద్రయ్యా! ఏంటిలా వచ్చావు?"

"ఆ.. హ.... ఏం లేదు - సార్‌తో కొంచెం మాట్లాడుదామని" నసిగాడు చంద్రయ్య.

"ఫరవాలేదులే ఆయనతో నేను చెబుతాను" ధైర్యం ఇచ్చింది జయ.

క్రితం రాత్రి కిళ్ళీ బడ్డీ దగ్గర తనకి, కృష్ణమూర్తికి జరిగిన సంభాషణ వివరించాడు చంద్రయ్య.

"దానికే ఇంత ఇదవుతున్నావా? సార్ రాగానే అలాగే చెబుతాను. నువెళ్ళిరా?"

"ఏదో మీ దయ గరీబోన్ని...నేనొక అయిదు వేలు పెడతాను మిగతాది...సార్"

"చెబుతానన్నానుగా నువ్వెళ్ళిరా."

"వస్తానమ్మా నమస్తే."

"నమస్తే"

ఉసూరుమంటూ నిట్టూర్చింది జయ. తనకు తెల్సు- భర్త దగ్గర పట్టుమని పది రూపాయలు లేవు. నెల జీతం తెచ్చి తనకే ఇస్తారు. అందులోంచి ఇంటి కిరాయి 150/- పాన్ షాపుకి 100/- చేతి ఖర్చుకి 50/- మూడొందలు మళ్ళీ అడిగి తీసుకుంటారు (అలా ఇచ్చి తీసుకోవటంలోనే అతడికి తృప్తి). మిగిలిన దాంతో తను సంసారం గడుపుకు రావాలి. అటువంటిది పదివేలు పెట్టుబడి పెడతాననటం- ఒక విధంగా నవ్వు, మరొక విధంగా కోపం వచ్చింది జయకు.

మొన్న ఒకసారి ఫ్రెండ్స్‌తో ఇళ్ళ ప్లాట్ గురించి మాట్లాడుతున్నారు.

"ఆరు వేలకు ఒక ప్లాట్ సార్ నేనొకటి తీసుకున్నాను" అన్నాడు కొత్తగా వచ్చిన కుర్ర క్లర్కు.

"అలాగా- అయితే మాకో రెండు ప్లాట్లు మాట్లాడిపెట్టవోయ్" అంటున్నాడు కృష్ణమూర్తి.

"రెండెందుకు గురూ" అంటున్నాడు మరో కొలీగ్.

"మీకు తెలియదు సార్. డబ్బు వుండాలే

కాని నాల్గు తీసుకున్నా నంతగ లేదు. అసలు తీసుకోవాలి సార్. అది మరో రెండేళ్ళకి మనం అమ్ముకుంటే ప్లాట్‌కి ఇరవై వేలు ధర పలుకుతుంది. అసలు ఈ బిజినెస్ మీద లక్షాధికార్లు అయిన వాళ్ళు చాలా మంది ఉన్నారు సార్! అంతెందుకు మన ఆఫీసులో లస్కర్ ఉండేవాడు. ఈ మధ్యనే ట్రాన్స్‌ఫర్ అయి వెళ్ళిపోయాడు. చూడు ఆయన నాల్గేళ్ళ క్రితం పది రూపాయల చొప్పున 600 గజాల పాట్ బస్‌స్టాండ్ దగ్గర తీసుకున్నాడు. ఇప్పుడు దాన్ని 90 వేల రూపాయలకు అమ్మేశాడు. ఆరువేలెక్కడ 90 వేలెక్కడ. 84 వేలు లాభం."

"అబ్బా!" ఆశ్చర్యపడ్డాడు కృష్ణమూర్తి.

"అవును సార్. రెండేళ్ళ క్రితం 100 రూపాయలకు గజం ఉన్న జాగా ఇప్పుడు గజంకు 300 రూపాయలు. దీనిలో ఉన్నంత లాభాలు ఎందులోనూ లేవు. అందుకే మొన్న మన ఆనందరావ్, బాబూరావ్ చెరొరెండు ప్లాట్లు తీసుకున్నారు. మీరు తప్పకుండా తీసుకోండి సార్. పిల్లలున్నారు, వాళ్ళ పెళ్ళిళ్ళ ఖర్చులకి బాగా ఉపయోగపడతాయి."

"అలాగే చూద్దాం. సరే ఉంటా."

"అలాగే సార్."

అంతా వింటున్న తనకి ఏదీ బుర్రకెక్కటం లేదు. రేపటికి కిరసనాయిల్ ఎలాగా? బియ్యంకూడా దగ్గిర పడుతున్నాయే అనే దిగులుతో బుర్ర పనిచేయటం లేదు.

"ఏమండీ కిరోసిన్ అయిపోయింది" ఫ్రెండ్స్ వెళ్ళిపోయిన తర్వాత భర్తతో అంది జయ.

"ఏం చెయ్యనురా జయా! నా దగ్గర ఏడు రూపాయలు ఉన్నాయి. ఇదిగో అయిదు రూపాయలు తీసికొని రాములుగాడితో తెప్పించు."

"ప్లాట్ గురించి మాట్లాడుతున్నారు. డబ్బెక్కడిదేంటి?" అయిదు రూపాయలు అందుకుంటూ నవ్వుతూ అడిగింది జయ.

"అదా నీ సందేహం. సందేహించకు మమ్మా ఈ కృష్ణమూర్తిని జయమ్మా. కృష్ణ ఎప్పుడూ నీనుంచి ఏదీ దాచడు జయా"

"మరి....?"

"అది బ్రతకటానికి కావాల్సిన రంగు. నల్గురిలో ప్రెస్టేజీగా, దర్జాగా బ్రతకటానికి కావాల్సిన హంగు మనకు లేదు అంటే ఎవ్వరూ సహాయం చెయ్యరు సరికదా చిన్నచూపు చూస్తారు. మన బ్రతుకులోని ప్రతీ అడుగుని తూచి చూచి వాటికి ఏవేవో అర్థాలు కల్పించి కామెంట్ చేసినవ్వుతూ నవ్విస్తూ మనని ఏడిపిస్తారు. ఉన్నవాడు వెల తక్కువ వస్తువు వాడితే, "సింపుల్ నేచర్" అంటారు. అదే లేనివాడు వాడితే "పూర్ ఫెలో ఏం చేస్తాడు పాపం" అంటారు. ఆ పాపం అనేపదం వుందే అందులో అర్థం విప్పి చెప్పటం ఎవరి తరం కాదు. ఉన్నవాడు వంద రూపాయలు అప్పు అడిగితే అతగాడు అడిగిందే అదృష్టంగా భావించి గబుక్కున తీసి ఇస్తారు. అదే లేనివాడు అప్పు అడిగాడా జేబులో వంద రూపాయలు వున్నా "సారీ" అంటారే తప్ప అయిదు కూడా అప్పు ఇవ్వరు.

"బిగించిన పిడికిలిలో ఏ వస్తువుందని చెప్పి అయినా నమ్మించవచ్చు. అదే తెరచిన చేతిలో ఏముందో అందరికీ తెల్సిపోతుంది. కాబట్టి మన బ్రతుకులు ఎప్పుడూ గుప్పిట మూసి ఉంచాలి తప్ప తెరచి ఉంచకూడదు...."

భర్తలో మరో కొత్త మనిషిని చూస్తూ 'ఇతను తను ఎరిగిన కృష్ణమూర్తేనా? తన ప్రాణానికి ప్రాణమైన భర్తేనా' అనుకుంది జయ.

అంకితం
మధ్యతరగతి కుటుంబ
దంపతులందరికీ.

